

బాలల దినోత్సవ ప్రత్యేకం

గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి..
బిసిఎం పాఠశాల విద్యార్థుల ప్రతిభ
'జంప్ రోప్' ఛాంపియన్స్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విద్యార్థుల్లో విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా కషి చేసే యాజమాన్యం ఒక వైపు... పాఠశాల యాజమాన్యం ఇచ్చే ప్రోత్సాహకంతో క్రీడల పట్ల మక్కువ చూపే విద్యార్థులు మరోవైపు... ఇలా క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఆలోచనలను కలిగి గల్లీ నుండి అంతర్జాతీయ స్థాయిలో జంప్ రోప్ ఛాంపియన్షిప్‌లో పాల్గొనడానికి పయనమయ్యారు మంగళం బిసిఎం పాఠశాల విద్యార్థులు. అంతర్జాతీయ ఛాంపియన్షిప్‌లో పాఠశాల విద్యార్థులు పాల్గొనడానికి పేదరికం అడ్డు వస్తోందని గమనించిన పాఠశాల కరస్పాండెంట్ ప్రియా పిల్లల భవిష్యత్తు కోసం ఒక అడుగు ముందుకు వేసి ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో.... అక్కడినుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడానికి వ్యయ ప్రయాసలతో గూర్చిన ప్రయాణాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. విద్యార్థుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయాలన్న వారి తపనకు పలువురు చేయూత అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్‌లో నలుగురు విద్యార్థులు జంప్ రోప్ పోటీలలో ఇటీవల నంద్యాలలో జరిగిన పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై మహారాష్ట్ర నాందేడ్ లో జరిగిన అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు జంప్ రోప్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుండి ఎంపికై ఈనెల 22 నుండి 25 వరకు సింగపూర్ దేశంలో జరిగే అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ లో పాల్గొననున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుండి అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపిక అవ్వడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నా పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు సింగపూర్ దేశానికి పంపడానికి అనేక ప్రయత్నాలను చేస్తున్నారు.

వారి ఉజ్వల భవిష్యత్తు కోసమే : ప్రియ, కరస్పాండెంట్, బిసిఎం హైస్కూల్, మంగళం

విద్యార్థులను విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నదే మా లక్ష్యం. అందుకే ఆర్థికంగా వెనుకబడిన వారైనా క్రీడల్లో రాణించే విద్యార్థులకు మా వంతుగా ఆర్థిక భరోసాను కల్పించడానికి శాయశక్తులా సహాయాన్ని అందిస్తున్నాం. మా పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికై, అక్కడ కూడా విజయం సాధించాలని, తద్వారా మన దేశానికి, రాష్ట్రానికి, మన తిరుపతి జిల్లాకు మంగళం ప్రాంతానికి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాము.

నా లక్ష్యం వైపే నా అడుగులు : కె.లాస్య, 9వ తరగతి, బిసిఎం స్కూల్

బాగా చదువుకొని జీవితంలో ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలన్నది నా కల. పేదరికం అడ్డొస్తున్నా నా క్రీడా స్ఫూర్తిని చూసి మా కరస్పాండెంట్ ప్రియా మేడం మాకు ఎంతో ధైర్యాన్ని, ఆర్థిక అవసరాలకు డబ్బులను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. మంచి క్రీడాకారిణిగా పేరు తెచ్చుకొని క్రీడల కోటాలో ఉద్యోగం సంపాదించాలన్నది నా ఆశ. మా నాన్న రణధీరపురం గ్రామపంచాయతీలో పంపు ఆపరేటర్. నేను జంప్ రోప్ పోటీలలో అంతర్జాతీయ స్థాయిలో ఆడడానికి ఎంపికయ్యాను. మన దేశానికి మంచి పేరు తీసుకు వస్తాను. నా లక్ష్యం డాక్టర్ అవ్వాలని.

చిన్ననాటి నుండే క్రీడల్లో ఆసక్తి : వి.వేదశ్రీ, 9వ తరగతి, బిసిఎం హైస్కూల్

నాకు చిన్ననాటి నుండి క్రీడలు పట్ల ఆసక్తి ఉంది. మా పాఠశాలలో క్రీడలకు మంచి ప్రాధాన్యమిస్తారు. పాఠశాలల్లో నిర్వహించే క్రీడల పోటీలలో పాల్గొని నేడు మంగళం నుండి సింగపూర్ లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉంది. మా నాన్న ఓ ప్రైవేట్ ఎంప్లాయ్. సింగపూర్ లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలలో విజయం సాధించి మా పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తాను.

క్రీడల్లో మంచి శిక్షణ ఇస్తున్నాం : కె.ప్రమీన, పిఇటి, బిసిఎం హైస్కూల్

మా పాఠశాలలో విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపే విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలలో నిర్వహించే క్రీడలకు, జిల్లాస్థాయి క్రీడల ఎంపికకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విజయం సాధించేలా తగిన తర్ఫీదును అందిస్తున్నాం. మా పాఠశాలకు చెందిన పునీత్ నాయుడు అనే విద్యార్థి ఇటీవల గోవాలో జరిగిన థైక్వాండో పోటీలలో బంగారు పతకాన్ని సాధించాడు. టెన్నికాయిట్, చెస్ పోటీలలో గత విద్యా సంవత్సరంలో ఎస్వీ ఆడిటోరియం వేదికగా నిర్వహించిన పోటీలలో మా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, నేడు అంతర్జాతీయ స్థాయికి మా పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఎంపికవడం సంతోషంగా ఉంది. మా పాఠశాల కరస్పాండెంట్ మాకు ఎంతో స్వేచ్ఛను ఇస్తూ, విద్యార్థులను క్రీడల పట్ల మక్కువ పెరిగేలా ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు.

టౌన్ బ్యాంక్ అప్రైజర్ 'నకిలీ'లలు

అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం
తనఖా బంగారం పదిలమేనా..?
ఆందోళన చెందుతున్న ఖాతాదారులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ అప్రైజర్ రూపేష్ చేతివాటంతో 'నకిలీ'లలు బయటపడ్డాయి. అప్రైజర్ల అంతర్గత బదిలీలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గతంలోనూ అతనిపై అనేక ఆరోపణలు ఉన్నా, బ్యాంకు అధికారులకు తెలిసినా విషయం బయటకు రానీకుండా 'మూసి'పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ చర్యతో టౌన్‌బ్యాంక్ ఖాతాదారుల్లో కలకలం నెలకొంది. తాము పెట్టిన బంగారం పదిలమేనా? అనే భయం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. అయితే తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం తీసుకున్న అన్ని శాఖల్లోనూ సీనియర్ అప్రైజర్‌ను పెట్టి తనిఖీలు చేయిస్తున్నట్లు ఎండి శివకుమార్‌రెడ్డి 'ప్రజాశక్తి'కి వివరణ ఇచ్చారు.

అప్రైజర్ రూపేష్ తన భార్య, తల్లి పేరుతో నకిలీ బంగారం పెట్టి ఆరు లక్షల రూపాయలు రుణం తీసుకున్నాడు. ఈ నకిలీ బంగారం విషయం టౌన్ బ్యాంకులో ఉన్న మిగిలిన అప్రైజర్లకు తెలిసినా వారు పట్టించుకోలేదని చర్చ జరుగుతోంది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఖాతాదారులు తనఖా పెట్టిన తమ బంగారం నకిలీదా? అసలుగా ఉందా లేదా అనేది అనుమానాలు రావడంతో బ్యాంక్ ఎండికి ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఐదు శాఖల్లో ఐదుగురు అప్రైజర్లు ఉన్నారు. తిరుమల శాఖలో పనిచేస్తున్న రూపేష్ తన అవసరాల కోసం బ్యాంక్ అధికారుల నే బురిడీ కొట్టి రుణం తీసుకోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. రూపేష్ నకిలీ బంగారు నగలు పెట్టి ఆరు లక్షల తీసుకోవడం కాకుండా దాన్ని త్వరగా విడిపించుకోవాలని ఆలోచన లేకపోవడంతో మళ్లీ అదే నకిలీ బంగారాన్ని రెన్యువల్ చేయించాడు. రెన్యువల్ చేయడంలో మరోసారి బంగారు నగలను పరిశీలించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. 30 సంవత్సరాల క్రితం ప్రభాకర్ అనే అప్రైజర్ ఇలాగే చేస్తే అప్పట్లో అతనిని సస్పెండ్ చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు సైతం దొంగ బంగారం తీసుకొచ్చి టౌన్ బ్యాంకులో రుణం తీసుకోవడానికి ప్రయత్నాలు చేశారన్న విమర్శలూ లేకపోలేదు. గతంలో తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకులో నకిలీ పత్రాలు సష్టించి రుణాలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖాతాదారుల్లో ఆందోళన

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు తక్షణమే ఋణం కావాలంటే టౌన్ బ్యాంకులో నగలు పెట్టి రుణం తీసుకునేవారు. నకిలీ బంగారం పెట్టి రుణం తీసుకున్నారని అప్రైజర్ పై ఆరోపణలు రావడంతో తాము బ్యాంకులో పెట్టిన బంగారు నగలు అసలు ఇవి ఉన్నాయా లేదంటే మార్చి చేశారా అన్న అనుమానాలు ఖాతాదారులు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో అప్రైజర్ల చేతి వాటం ప్రదర్శించడం వల్ల బ్యాంకుకు ఎక్కువమంది ఫోన్లు చేసి తమ నగలు సురక్షితంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకుంటున్నారు. కొంతమంది బ్యాంకుకు వచ్చి తమ నగలు చూపించాలని పట్టుబడుతున్నారు. దీంతో బ్యాంకు అధికారులు ఖాతాదారులకు సమాధానం చెప్పలేని పరిస్థితి.

అన్ని శాఖల్లోని బంగారం తనిఖీ : ఎమ్‌డి

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో బంగారు నగలు పెట్టి రుణం తీసుకున్న అన్ని శాఖలు సీనియర్ అప్రైజర్‌ను పెట్టి తనిఖీలు చేయిస్తున్నట్లు ఎండి శివ కుమార్ రెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగలేదని ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రైజర్ పై కఠిన చర్య తీసుకున్నామన్నారు. టౌన్ బ్యాంకులో అన్నీ సక్రమంగానే ఉన్నాయని వెల్లడించారు.

అసెంబ్లీలో గళం విప్పిన ఎంఎల్‌ఎ

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - కోట

జిల్లాల విభజన ప్రక్రియలో భాగంగా గూడూరుకు అన్యాయం జరిగిందని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ హాల్‌లో స్పీకర్ సమక్షంలో తన గళం విప్పారు. ఏదైనా పనులు నిమిత్తం ప్రజలుగానీ, అధికారులు గానీ తిరుపతి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేగాక 90 కిలోమీటర్లు నుండి 154 కిలోమీటర్లు దూరం ఉందని తెలిపారు. అదేవిధంగా నెల్లూరు జిల్లాకు 40 కిలోమీటర్లు దూరం మాత్రమే ఉందని అన్నారు. తిరుపతి జిల్లాలో కలిసిన గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలన్నారు. అదేవిధంగా యువగళం పాదయాత్రలో గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని విద్యా శాఖామాత్యులు నారా లోకేష్‌ను కోరగా, కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి జన్మదిన సందర్భంగా గూడూరు నందు మహిళలతో ముఖాముఖీ కార్యక్రమంలో కూడా ప్రజలు కోరగా నెల్లూరులో కలుపుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో...
తండ్రీకొడుకులకు జైలు శిక్ష, జరిమానా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన తండ్రి కొడుకులకు ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు, ఆరు లక్షల రూపాయల జరిమానా విధించినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు ప్రకటించారు. తిరుపతి డివిజన్ కరకంబాడి బీటు కష్ణాపురం సెక్షన్లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన అన్నమయ్య జిల్లా, పెనగలూరు మండలం, ఎన్ ఆర్ పురం పోస్ట్, సిరివరం గ్రామానికి చెందిన తండ్రి తోట చిన్న చెంగయ్య, కుమారుడు తోట చెంగయ్యలను 2019, 2022 సంవత్సరాలలో కేసులు నమోదు చేశామన్నారు. ఇంత కాలంగా కొనసాగుతున్న విచారణలో ముద్దాయిలను దోషులుగా గుర్తించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి తండ్రి కొడుకులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షను, ఆరు లక్షల రూపాయల జరిమానాలు విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. ముద్దాయిలను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందన్నారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఒక హెచ్చరికగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

టిటిడి హెల్త్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమలలో నాలుగో వార్డులో హెల్త్ విభాగంలో పనిచేస్తున్న సూపర్వైజర్ బత్తయ్యను కొట్టిన హెల్త్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టిటిడి పరిపాలన భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ టీటీడీ లాంటి ధార్మిక సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు సూపర్వైజర్‌ను కొట్టిన హెల్త్ అధికారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్‌పై వచ్చిన హెల్త్ అధికారి తాను డాక్టర్నే కాదు, రౌడీని కూడా అంటూ కొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే అనేకమంది సూపర్వైజర్ల ఐడి కార్డులు బలవంతంగా లాక్కొని డ్యూటీ నుండి తొలగించాడని తెలిపారు. హెల్త్ కార్మికులను చాలా అవమానకరంగా మాట్లాడడం సరైందికాదన్నారు. కార్మికులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం, బెదిరించడం, విధులు నుండి తొలగిస్తామని వేధించడాన్ని తప్పు బట్టారు. టిటిడిలో ఇటువంటి అధికారులుంటే ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. హెల్త్ ఆఫీసర్ పై చర్యలు తీసుకునే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.వేణు గోపాల్ మాట్లాడుతూ కార్మికులను కొట్టే అధికారం ఎవరిచ్చారని, వెంటనే హెల్త్ అధికారి ప్రవర్తనపై టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఆఫీసర్ కొట్టిన దెబ్బలకు చెవి రంధ్రం పడిందని తెలిపారు. సీఐటీయూ నాయకులు పి.బుజ్జి, నరేంద్ర, జయంతి ,సుందరం, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్దు, ప్రభాకర్, కేశవులు, హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిరంజీవి, బత్తయ్య, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

టిటిడి పరిపాలనా భవనం ఎదుట నిరసన

నేటినుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
అధికారి సూర్యనారాయణ పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తెలుగు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ గురువారం నుండి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని అధికారి సూర్యనారాయణ వెల్లడించారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్లో ని విజయవాడ , విశాఖపట్నం , గుంటూరు , తిరుపతి ప్రాంతాలలో ఈ వారోత్సవాల్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం, గెజిటెడ్ లైబ్రేరియన్ వెన్నెటి సూర్యనారాయణ తెలిపారు. 14వ తేదీ ప్రారంభోత్సవ వేడుకలను జరుపుకుంటామన్నారు. 15వ తేదీ పుస్తక ప్రదర్శన , 16వ తేదీ గ్రంథాలయ అధికారుల సదస్సు , 17వ తేదీ కవి సమ్మేళనం , 18 న పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించుతామన్నారు. 19వ తేదీ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జన్మదినం సందర్భంగా మహిళా సాధికారికపై చర్చ కార్యక్రమం ఉంటుందన్నారు. చివరి రోజు 20వ తేదీ ముగింపు సమావేశాలు ఉంటాయి. అదే రోజు పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులచే బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

తలకోన ఆలయ అర్చకునిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి -యర్రావారిపాలెం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఇద్దరు ప్రధాన అర్చకుల మధ్య జరిగిన గొడవలు సందర్భంగా సిసి ఫుటేజ్‌లో రికార్డ్ అయిన వీడియో మీడియా ద్వారా వైరల్ కావడంతో ఆలయ అర్చకులైన సత్య ప్రసాద్ శర్మను సస్పెండ్ చేస్తున్నట్లు కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ సోమవారం అర్చకులైన శివ ప్రసన్న శర్మ, సత్యప్రసాద్ శర్మ ఇద్దరు గుడి ఆవరణంలో భక్తుల ఎదుట కొట్టుకోవడం, విచక్షణ రహితంగా తమ విధులను విస్మరించి హిందూ ధర్మముకు విరుద్ధంగా ఆలయ ప్రతిష్టను దిగజార్చారన్నది ఆరోపణ. హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం సెక్షన్ (37)2 ,ఆఫీస్ హోల్డర్ అండ్ సర్వెంట్స్ పనిష్మెంట్ రూల్స్ 1987 నిబంధన ప్రకారం విచారణ జరిగేంతవరకు సత్య ప్రసాద్ శర్మను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి బుధవారం లేఖలో పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై సత్య ప్రసాద్ శర్మను 24 గంటల్లోపు వివరణ కోరగా ఇవ్వకపోవడంతో అశ్రద్ధ వహించినందుకు సస్పెన్షన్‌కు మరో కారణమని వారు లేఖలో పేర్కొన్నారు.

తిరుపతి జిల్లాలో ముసురు వర్షం
అత్యధికంగా బి.ఎన్ కండ్రిగలో..

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బంగాళాఖాత అల్పపీడనం ప్రభావం వల్ల తిరుపతి జిల్లాలో విస్తారంగా ముసురు వర్షాలు కురిసాయి. బిఎన్ కండ్రిగలో 78.6 మి.మీ వర్షపాతం అత్యధికంగా నమోదయ్యింది. చిల్లకూరు 75.2మి.మీ., గూడూరు 68.8, డక్కిలి 57.2, రామచంద్రాపురం 54.0, తడ 51.4, కోట 48.2, దొరవారి సత్రం46.2, చిట్టమూరు 46.2, పిచ్చాటూరు 43.4, వడమాలపేట 43.0, బాలయ్య పల్లి 40.4, తిరుపతి రూరల్ 36.8 , తిరుపతి అర్బన్ 35.4, రేణిగుంట 35.2, ఓజిలి 34.0, సత్యవేడు 33.2, వెంకటగిరి 32.4, సూళ్లూరుపేట 31.8, వాకాడు 28.6, చంద్రగిరి 28.6 , నాగలాపురం 25.4 , ఏర్పేడు 22.2, పెళ్లకూరు 20.2, నాయుడుపేట19.2, వరదయ్యపాలెం18.2, పాకాల15.2 , శ్రీకాళహస్తి13.8, నారాయణవనం13.8, తొట్టంబేడు 12.6 పుత్తూరు 11.6, కే వి బి పురం 10.2, ఎర్ర వారి పాలెం 7.4, చిన్న గొట్టిగల్లు 5.8 వర్షపాతం నమోదయింది

తిరుమల ఘాట్‌లో కూలిన వృక్షం

డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి ఆన్‌లైన్ యాప్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తుల ఆన్లైన్ విక్రయాల కొరకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మెప్మా అధికారులను ఆదేశించారు. నూతన ఆన్లైన్ యాప్, డ్వాక్రా ఉత్పత్తులపై నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా అధికారులతో బుధవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేసే వివిధ వస్తువులను డిజిటల్ మార్కెటింగ్ చేయించేందుకు ప్రభుత్వం అమెజాన్, ఫ్లిప్ కార్ట్ యాప్ వలె ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందని అన్నారు. ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓ.ఎన్.డి.సి) ఆన్లైన్ ప్లాట్ఫామ్ పై ఈ యాప్ ను రూపొందించడం జరిగిందనీ అన్నారు. ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ లో మై స్టోర్ అనే ఆప్ ను డౌన్లోడ్ చేసుకుంటే ఉచితంగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించవచ్చునని తెలిపారు ఈ యాప్ లో బుక్ చేసుకున్న వస్తువులను ఏడు రోజుల్లోపు కొనుగోలుదారులకి డెలివరీ చేసేలా రూపొందించబడిందని తెలిపారు. కాగా యాప్ లో కొనుగోలుదారులు కొనుగోలు చేస్తే ఆ నగదు నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలోకి జమ అయ్యేలా రూపొందించడం జరిగిందన్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్ ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ యాప్ వినియోగించడం వలన కలిగే లాభాలను ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, మెప్మా పి.డి. రాధమ్మ, సి.ఎం.ఎం.లు కష్ణ వేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

అధికారుల సాక్షిగా.. వర్షంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

గుత్తేదారుకు రుసుం చెల్లించొద్దు

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారస్తులు తప్ప చిరు వ్యాపారులు ఎవ్వరూ ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ గుత్తేదారుకి ఎటువంటి రుసుము చెల్లించ వద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పలు వ్యాపారస్తుల వద్ద ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ గుత్తేదారుడు రుసుము వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు.

రాత్రిపూట చెత్తకుప్పలు తొలగించండి

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని రాత్రి పూట చెత్త కుప్పల తొలగింపు, చెత్త సేకరణ నిరంతరాయంగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో రాత్రి పూట చెత్త సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాణిజ్య సముదాయాలు, హోటల్స్, జన సమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాత్రిపూట చెత్త కుప్పల (జి.వి.పి.) తొలగింపు, సేకరణ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టు గా చేపట్టామని అన్నారు. వీటిని శుభ్రం చేయడానికి రాత్రి 9 నుండి ఉదయం 4గంటల వరకు ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ నరసింహ ఆచారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన పేదల కోసం నిర్మిస్తున్న గృహాల పురోగతిపై కమిషనర్ ఎన్.మౌర్య గహ నిర్మాణ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆరు లేఔట్లలో నిర్మాణంలో ఉన్న గృహాల పురోగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆమరయ్య, గృహ నిర్మాణ శాఖ డి.ఈ.లు శ్రీనివాస రావు, మోహన్, ఏ.ఈ.లు, హౌసింగ్ స్పెషలిస్ట్ కాటమరాజు పాల్గొన్నారు.

విద్యుత్‌స్మార్ట్ మీటర్లు ఆపండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా పెడుతున్నారన్నారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ స్మార్ట్ మీటర్లు పెట్టడం నమ్మకద్రోహమని పేర్కొన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాలని, బ్యాలెన్స్ పూర్తయితే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఇది పేదలకు పెనుభారం కానుందన్నారు. ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ట్రూ అప్ ఛార్జీల భారం వేస్తున్నారన్నారు.

వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం

వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్‌రాయుడు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ వాలీబాల్, కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభ మ య్యాయి. ముఖ్య అతిథి గా హాజరైన టిడిపి మండల అధ్యక్షుడు మావిళ్లపల్లి సుధాకర్ నాయుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో పాల్గొనే బాల బాలికలు అండర్ 14 , 17 వారికి మాత్రమే అవకాశం ఉంటుందని టోర్నమెంట్ నిర్వాహకులు జనార్దన్ తెలిపారు. ఏదైనా పాఠశాలలో చదువుతూ వుండాలని, ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని ప్రతి టీం ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీలలో గెలు పొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్ , మస్తాన్, కిషోర్ ముని కుమార్ వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అనుకూల బడ్జెట్: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వారధిగా వుందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిచంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు, అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆమోదయోగ్యంగా ఉందన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, పరిష్కరించే బాధ్యతను కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి ప్రజారంజక బడ్జెట్ రూపొం దించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

ఆచార్య రాజశేఖర్‌కు ఘన సన్మానం

ఏబిఆర్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏబిఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోశాధికారి, ఎస్వియూ జంతుశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎం రాజశేఖర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా జువాలజీ విభాగంలో రాజశేఖర్‌ని ఏబిఆర్ఎస్ఎం నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో విద్యా, పరిశోధనా రంగాలలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తన పేరును ప్రతిపాదించిన ఎస్వియూ అధికారులకు, అవార్డుతో సన్మానించిన విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి, సిఎం చంద్రబాబు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రతినిధులు ప్రొఫెసర్ త్రిపుర సుందరి, డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ రంజని, శ్రీవాణి, డాక్టర్ వివేక్, మంజునాథ్, వెంకటసుబ్బయ్య, బాబు, మహేంద్ర , సుమన్‌లు పాల్గొన్నారు.

'పశువైద్య కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి'

ప్రజాశక్తి - క్యాంపస్: గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి విసి డాక్టర్ జేవి రమణకు ఎఐఎస్ఎఫ్ నేతలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి మాట్లాడుతూ విజయనగరం జిల్లా గరివిడిలో ఉన్న పశు వైద్య కళాశాల 70 మంది విద్యార్థులు జీవితాలను కాపాడాలని డిమాండు చేశారు. విసిఐ అనుమతి వచ్చేలా కృషి చేయాలని, ల్యాబ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. ఈ నెలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం కళాశాలకు రానున్న సందర్భంలో సమస్యలు పరిష్కరించకుండా అనుమతిస్తారా? లేదా అనే సందేహం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నగర అధ్యక్షులు,కార్యదర్శులు హరికృష్ణ, చంద్ర నాయక్, మోహన్, సురేష్ పాల్గొన్నారు.

ప్రతాపరెడ్డికి పితృవియోగం

వెంకటసుబ్బారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టిడిపి సీనియర్ నేత కన్నలి ప్రతాపరెడ్డి తండ్రి కన్నలి వెంకటసుబ్బారెడ్డి బుధవారం తుది శ్వాస విడిచారు. వెంకటసుబ్బారెడ్డి వయోభారం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడు తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తొట్టంబేడు మండలంలోని ఆయన స్వగ్రామమైన పెద్దకన్నలిలో తుది శ్వాస విడిచారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల నుంచి నేరుగా పెద్ద కన్నలికి చేరుకుని వెంకటసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. ప్రతాపరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచి, ధైర్యం చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర విభాగం, ఐఐపిఏ తిరుపతి లోకల్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు "న్యాచురల్ ఫార్మింగ్ అండ్ కౌ బేస్డ్ ప్రొడక్ట్స్" అనే అంశంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐపిఏ తిరుపతి లోకల్ బ్రాంచ్ సెక్రటరీ ఆచార్య డి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాచురల్ ఫార్మింగ్ ప్రమోటర్ డాక్టర్ కె. గంగాధరం, గోవనం ట్రస్ట్ చైర్మన్ ఎస్. యువరాజు, ఐఐటిపి తిరుపతి లోకల్ బ్రాంచ్ చైర్ పర్సన్ ఆచార్య టి లక్ష్మమ్మ హాజరవుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పరిశోధకులు మేధావులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రగిరిలో వరస దొంగతనాలు

బెంబేలెత్తుతున్న ప్రజలు

సంఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -చంద్రగిరి: చంద్రగిరిలో దొంగలు పోలీసులకు సవాలు విసురుతున్నారు. వరస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చంద్రగిరి ప్రశాంత నగర్లో దొంగతనం జరిగి రోజులు కాకముందే బుధవారం రాత్రి దొంగలు జాతీయ రహదారి వద్ద ఉన్న పిల్లల దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఇదే తరహాలో నాగాలమ్మ మలుపు వద్ద గల ఓ ఫెర్టిలైజర్స్ దుకాణంలో దొంగలు చొరబడి గల్లాలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. మరోవైపు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించారు. ఒకరోజు వరసగా మూడు దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు సవాలుగా మారారు. బాధితులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మండలంలోని 21 పంచాయతీలలో సుమారు 64 వేల మంది జనాభా కలిగిన చంద్రగిరి పోలీస్ స్టేషన్ కు 56 మంది సిబ్బంది ఉండవలసి ఉండగా ప్రస్తుతం 33 మందే విధులు నిర్వహిస్తున్నారు. సెక్షన్ లో పది, కంప్యూటర్ నలుగురు, ఇండోర్ స్టాఫ్ వద్ద ఇద్దరు, కోర్ట్ వద్ద ముగ్గురు, రక్షక్ వద్ద ఇద్దరు, బ్లూకోట్‌వద్ద ఇద్దరు, పనపాకం టోల్ ప్లాజా నలుగురు, రంగంపేట చెక్ పోస్ట్ వద్ద ఇద్దరు, రామిరెడ్డిపల్లి ఒకరు, ఐడి పార్టీ వద్ద ముగ్గురు సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. తగినంత సిబ్బంది లేకపోవడంతో పెద్ద మండలం అయిన చంద్రగిరి లో గస్తీ నిర్వహించటం పోలీసులకు కష్టతరంగా మారింది. ప్రభుత్వం, పోలీసు, ఉన్నతాధికారులు స్పందించి చంద్రగిరి పోలీస్ స్టేషన్ కు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుకొంటున్నారు.

రైల్వే ప్రయాణికుల వసతులపై ఆరా

రైల్వే స్టేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వేస్టేషన్‌ని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలాపల్లి రాంబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్టేషన్‌లోని బుకింగ్ ఆఫీస్ లోని సూపర్‌వైజర్‌ని , స్టాఫ్‌ని డ్యూటీకి సంబంధించిన వివరాలు, డిజిటల్ ట్రాన్స్‌సక్షన్స్ , స్టాఫ్ సమస్యలు అడిగి తెలుసుకుని పలు సూచనలు అందించారు. పలు ఆహార దుకాణాలు తనిఖీ చేసి వాటి నాణ్యత, డేట్స్ , ధరలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు వెయిటింగ్ హాల్స్‌కు సంబంధించి అధికారిని అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక డైరెక్టర్‌గా ఎ.మధు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్గా యర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు అన్నాసముద్రం మధు నియమితులయ్యారు. దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసినందుకు గుర్తింపుగా ఈ పదవి లభించినందుకు ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేసి సంబరాలు జరుపుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గుర్తించి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి లోకేష్ కి రుణపడి ఉంటానని ధన్యవాదాలు తెలిపారు .ఇచ్చిన బాధ్యతను తుచా తప్పకుండా శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

తమిళ ఉపాధ్యాయురాలు హాజరు కావడం లేదు

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పుత్తూరులోని గేటు పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత తమిళ పాఠశాల ఉపాధ్యాయురాలు వి.ఎస్. బేబి కస్తూరిభాయి విధులకు హాజరు కావడం లేదని, విద్యార్థులు ఆ సబ్జెక్ట్ లో వెనుకబడిపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణికి ఫిర్యాదు చేశారు. దీంతో. ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి మాట్లాడుతూ తమిళ ఉపాధ్యాయురాలు ఎక్కడ వున్నా పాఠశాలకు రావాలని, లేకుంటే జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాల మేరకు శాఖా పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాన్సర్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: నేటి నుండి నిర్వహించనున్న సిడి, ఎన్‌సిడి క్యాన్సర్ లక్షణాలున్న వారి గుర్తింపు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని వైద్యాధికారి చైతన్య ఆదేశించారు. బుధవారం దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ సర్వే చేయవలసిన విధానాన్ని, ప్రజల నుండి సమాచారం ఏ విధానంలో రాబట్టాలనే అంశాలపై వివరించారు. రోజువారి ఐదు గృహాలను ఎంపిక చేసుకొని ఆ కుటుంబంలో ఉన్న18 ఏళ్ల పైబడిన వారి నుండి నోరు, రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలను ఆరా తీయాలి. సర్వే సమయంలో ఆరోగ్య సిబ్బంది వద్ద ఉండవలసిన ఆరోగ్య పరికరాలు తప్పక ఉండాలని తెలిపారు. ప్రజలకు అందిస్తున్న పలు రకాల ఆరోగ్య సేవల్లో లక్ష్యాలు సాధించాలని సూచించారు. వాటిని ఆన్‌లైనులో సకాలంలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ సంపూర్ణమ్మ,హెచ్ ఎస్, కిరణ్, ఎం, ఎల్ హెచ్ పి, ఏఎన్ఎమ్,హెల్త్ అసిస్టెంట్స్,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలు విద్యార్థుల మానసిక దృఢత్వానికి కీలకం

రీజినల్ మేనేజర్ రాంప్రసాద్

ప్రజాశక్తి - క్యాంపస్ : నిరంతరం చదువుల పోటీ ప్రపంచంలో పోరాడుతూ మానసికంగా కృంగిపోతున్న విద్యార్థులకు క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు కీలకంగా వ్యవహరిస్తాయని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా పోటీలు మొదటి దశ ముగింపు కార్యక్రమం వ్యవసాయ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని పొందుతారన్నారు. చదువులే కాకుండా విద్యార్థులకు అప్పుడప్పుడు క్రీడలను కూడా నిర్వహించాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులు ప్రతి రంగంలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడానికి కళాశాల స్థాయి నుండి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని అదనపు ఎస్‌పి కె రవి మనోహరాచారి అన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికాంత్ రెడ్డి వివిధ అంశాలలో పోటీ చేసి గెలిచిన టీమ్ లకు అవార్డులను ప్రదానం చేశారు. ఆఖరి రోజు క్రీడాంశాలలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు బాస్కెట్బాల్ విభాగంలో శ్రీకాకుళం వ్యవసాయ కళాశాలపై విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో వ్యవసాయ కళాశాల తిరుపతి విద్యార్థులు బాపట్ల వ్యవసాయ కళాశాలపై విజయం సాధించారు. ఈ ముగింపు కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 18 కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది, విద్యార్థులు, ఎస్వీ వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి: ఆర్‌డివో

అధికారులతో చర్చిస్తున్న ఆర్‌డివో రామ్మోహన్

ప్రజాశక్తి -చంద్రగిరి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా సమస్యలపై ప్రజల నుండి వచ్చిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చంద్రగిరి తహశీల్దారు కార్యాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహశీల్దారు శివరాం సుబ్బయ్యను ఆదేశించారు. ఇందిరమ్మ కాలనీలోని లేఅవుట్ పరిధికి మించి భూ అక్రమనకు పాల్పడి అక్రమ నిర్మాణాల తొలగింపు, ప్రభుత్వ భూమికి నకిలీ ఇంటి పట్టాలను సృష్టించి అమ్మకాలు జరిపిన విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అపార్ నమోదు కోసం కావల సిన జనన ధ్రువీకరణ పత్రా లు, కుల ఆదాయ ధ్రువీకణ పత్రాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతుల భూము లకు సంబంధించి పట్టాదారులు పాస్ పుస్తకాల మంజూరు, మ్యుటేషన్, ఆన్లైన్ నమోదు తదితర అంశాలపై క్లుప్తంగా మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్ఐ భాస్కరయ్య, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వరి, సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వోలు వెంకన్న, విజయ్ కుమార్ రెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు

క్రైం న్యూస్

లోయలో పడ్డ కారు..

ఆరుగురురికి గాయాలు

ప్రజాశక్తి -చంద్రగిరి: కారు లోయలో పడి ఆరుగురికి గాయాలైన సంఘటన చంద్రగిరి మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చంద్రగిరి మండలంలోని తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట ఘాట్ రోడ్లు వద్ద మంగళవారం అర్ధరాత్రి కారు లోయలో పడింది. బెంగళూరు నుండి తిరుపతికి వస్తున్న కారు అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. అర్ధరాత్రి సమయం కావడంతో కారులోని ప్రయాణికులను రోడ్డుపై వెళుతుఉన్న వాహన చోదకులు గుర్తించి లోయ నుంచి రోడ్డుపైకి తీసుకొచ్చారు. కారును ఉదయం స్థానికుల సాయంతో బయటకు తీశారు. డ్రైవర్ చాకచక్యంగా కారువేగాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

కుటీర పరిశ్రమ దగ్ధం

రూ.మూడు లక్షల మేర నష్టం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైన వస్తు సామగ్రి

ప్రజాశక్తి -నాయుడుపేట: కుటీర పరిశ్రమలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పరికరాలు దగ్ధమై మూడు లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం సంభవించిన సంఘటన నాయుడుపేట మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మాజి కండ్రిగ గ్రామం లో అమ్మ ఫౌండేష న్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేపర్ ప్లేట్ల చిన్న కుటీర పరిశ్రమ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి సామగ్రి దగ్ధమైంది. సుమారు రెండు నుండి మూడు లక్షల రూపాయలు వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని నాయుడుపేట అగ్నిమాపక శాఖ ఎస్ఐ శ్యాంబాబు తెలిపారు. నాయుడుపేటకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతురాలు కృష్ణవేణి పేద, అనారోగ్య పిల్లల కోసం నడుపుతున్న అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోనే ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేపర్ ప్లేట్లు కుటీర పరిశ్రమ బుధవారం ఉదయం 10, 12 గంటల సమయంలో వర్షం కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి పేపర్ ప్లేట్ల కోసం వాడే మెటీరియల్ పూర్తిగా దగ్ధమైందని మిషన్ కొంతవరకు పాడై ఉండొచ్చని పరిశ్రమలో నిప్పంటుకున్న సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. సకాలంలో అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలు అదుపు చేశామని తెలిపారు.

పలువురిపై న్యూసెన్స్ కేసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని రామసేతు సమీపంలో రోడ్డులోకి చొచ్చుకొచ్చేలా దుకాణాలు నిర్వహిస్తూ పలువురుపై బుధవారం వన్ టౌన్ పోలీసులు టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఆ దుకాణాలపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నామని సిఐ గోపీ తెలిపారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని సీఐ అన్నారు.

మాజీ జెడ్‌పిటిసికి బెయిల్

మాజీ జెడ్‌పిటిసి ప్రసాద్‌గౌడ్‌కు ఆహ్వానం పలుతున్న కార్యకర్తలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం కొత్తపట్నం పంచాయతీ కి చెందిన మాజీ జెడ్పిటిసి, కొత్తపట్నం పంచాయతీ ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్ కు బుధవారం బెయిల్ మంజూరు చేశారు. ఇటీవల కొత్తపట్నం పంచాయతీలో ఉపాధి హామీ కూలీల విషయంపై ఎంపిడిఓ కార్యాలయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై ఉప్పల ప్రసాద్ గౌడ్ పై పోలీసుస్టేషన్‌లో ఏపీఓ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఉప్పల ప్రసాద్ గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో బుధవారం కొత్తపట్నం పంచాయతీకి ఉప్పల ప్రసాద్ గౌడ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిశారు. ఉప్పల ప్రసాద్ గౌడ్ కు బెయిల్ మంజూరు అయి తిరిగి నివాసానికి రావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, సిద్ధవరం సర్పంచ్ భర్త వైసీపీ సీనియర్ నాయకులు ఇంగిలాల రామయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీరుగా కిన్నెర గోపినాథ్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: గృహ నిర్మాణ సంస్థ మండల అసిస్టెంట్ ఇంజనీరుగా కిన్నెర గోపినాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గాజుల పెళ్లూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రజలకు ఎంతో చేరువలో ఉంటూ ప్రజల మన్ననలు అందుకుంటూ మంచి పేరు తెచ్చుకున్న గోపిని ప్రభుత్వం గుర్తించి మండల గృహ నిర్మాణ సంస్థ ఇంజనీరుగా బాధ్యతలు అప్పగించారు. మండలంలో గతంలో పనిచేస్తున్న హౌసింగ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ పొందడంతో ఆ శాఖలో అసిస్టెంట్ ఇంజనీరింగ్ పోస్ట్ ఖాళీగా ఉండడంతో గోపినాథ్‌ను నియమించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణ సంస్థలు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు దగ్గరగా వుంటూ సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన అధికారులకు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అసిస్టెంట్ దయాకర్, యుగంధర్ పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు వితరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి గ్రేటర్ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా తిరుపతి ప్రసూతి ఆస్పత్రి వెలుపల రోగి, రోగి బంధువులు కూర్చునేందుకు రెండు లక్షల రూపాయలు విలువ చేసే 22 సిమెంట్ బెంచ్‌లను ఎస్వీ మెడికల్ కాలేజీకి వితరణగా అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి గ్రేటర్ లయన్స్ క్లబ్ సభ్యులు అందరూ వైద్యులు కావడంతో వారికి రోగి బంధువులు బాధలు చూసి వారు కూర్చునేందుకు వీలుగా ఈ బెంచ్ లు ఏర్పాటు చేశామన్నారు. వివిధ ప్రాంతాల్లో ఈ బెంచీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకట్, డిఎస్ ఎన్ మూర్తి, డాక్టర్ కిరీటి, మెటర్నిటీ హాస్పిటల్ సూపరిండెంటెంట్ డాక్టర్ పార్ధ సారథిరెడ్డి ,లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరావు సూరి శెట్టి, డాక్టర్ హరి బాబు, డాక్టర్ ఏ ఆర్ రెడ్డి , డాక్టర్ నిర్మల ,డాక్టర్ బాలాజీ, డాక్టర్ శశి , డాక్టర్ జయశంకర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మహిళ మృతి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మహిళ మృతి చెందిన సంఘటన ఏర్పేడు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన చెన్నంపల్లి మురళి భార్య చెన్నంపల్లి యశోద (35) బుధవారం పొలం వద్దకు వెళ్లింది. గడ్డివాము నుండి గడ్డిమోపును భుజంపై ఇంటికి తీసుకుని వెళుతున్న సమయంలో కంటికి కనిపించకపోవడంతో దారి పక్కనే వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

సిఐటియు కార్యకర్త మృతి



మృతుడికి నివాళులర్పిస్తున్న జోగి శివకుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పరిధిలోని అరుంధతీయ వాడకి చెందిన రుద్ర పాక కిరణ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గూడూరు మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాడు. సిఐటియు కార్యకర్తగా ఉన్నాడు. ఈయన మృతి విషయం తెలుసుకున్న సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్ , సిఐటియు నాయకులు సురేష్ , అడపాల ప్రసాద్‌లు మృత దేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. అనంతరం పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు.

గ్రామ సభలే గ్రామాభివృద్ధికి తొలిమెట్టు: ఎంపిడివో

ప్రజాశక్తి -పెళ్లకూరు: గ్రామ సభలే గ్రామ అభివృద్ధికి తొలిమెట్టు అని ఎంపీడీవో ప్రమీల రాణి పేర్కొన్నారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయం లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక విధివిధానాలపై బుధవారం సమావేశం నిర్వహించారు. మండల ఎంపిపి పోలంరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలు అభివృద్ధికి గ్రామ సభలు నిర్వహించి అవసరమైన పనులు గుర్తించాలని సూచించారు. అభివృద్ధి సాధించాలంటే పిల్లలందరికీ మంచి విద్య అందించాలని, మానసిక వికాసం, శారీరక దారుఢ్యం ఉండి మంచి పౌరులుగా విలువలతో కూడిన విద్య అవసరమని, అందుకు అనుగుణంగా గ్రామ పాఠశాల వాతావరణం కల్పించాల్సిన ఆవశ్యకత వుందన్నా రు. అందరం కలిసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అందు కు అవసరమైన సహాయ సహ కారాలు అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, అగ్రికల్చర్ ఏవో ప్రవీణ, ఐసిడిఎస్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి పోలంరెడ్డి శేఖర్

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక విధివిధానాలపై బుధవారం సమావేశం నిర్వహించారు. మండల ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో అవసరమైన పనులు గుర్తించాలని సూచించారు. అభివృద్ధి చెందాలంటే పిల్లవాణ్ని మంచి విద్యను అందించాలని అప్పుడే మానసిక వికాసం, శారీరక దారుఢ్యం నుండి మంచి పౌరులుగా విలువలతో కూడిన విద్య కావాలి. అందుకు అవసరమైన గ్రామ పాఠశాల వాతావరణం కల్పించాలన్నారు.

కార్యకర్తలకు అండ: బుజ్జి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు బుజ్జి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు చంద్రబాబు భరోసా ఉంటుందని ఆ పార్టీ 22 వార్డు యూనిట్ ఇన్‌ఛార్జి నెమళ్లూరు బుజ్జి అన్నారు. బుధవారం ఆయన 22వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందడం ద్వారా ప్రమాద బీమా ఐదు లక్షలు పొందచ్చని సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన పొందే అవకాశం ఉంటుందనీ, కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శివకుమార్, తేజ, నరేష్, శంకరయ్య, విమలమ్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు

ఏపీ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో రైతులకు మేలు కలుగుతోందని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా పుత్తూరు రూరల్ మండలం గోపాలక్రిష్ణాపురం సచివాలయంలో మాధవయ్య బుధవారం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులను ఆదుకునేందుకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందిస్తోందని, అన్నదాత సుఖీభవకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు ఏడీఈఆర్ రమేష్ రాజు, ఏవో ఎస్ కోదండయ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈ మురళి, పుత్తూరు రూరల్ మండల టిడిపి ప్రధానకార్యదర్శి ఎ బాలాజీ, టిడిపి నాయకులు బాలకృష్ణారెడ్డి, చిన్నా, గాలి బాబు, గంగాకుమార్, హరిగోపాల్, మోహన్ పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలోని బోడేవాళ్లపల్లి, విఆర్ అగ్రహారం పంచాయతీలో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా రైతులకు పంట బీమాపై మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. వరికి ప్రీమియం రూ.435, డిసెంబర్ 31వ తేదీ లోపు వేరుశనగకు రూ.290 డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. సంబంధిత కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, వేరుశనగ, మామిడి పంటల మెళుకువలను వివరించారు. పంటలో విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగులు , నివారణ చర్యలు గురించి హార్టీ కల్చర్ ఆఫీసర్ శివకుమారి వివరించారు. హార్టికల్చర్ స్కీమ్స్, ప్రకృతి వ్యవసాయం, ఘన జీవామృతం, తదితరాలపై రవి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెస్ట్ వరత్తూరు, కల్లివెట్టు, నెల వాయి పంచాయతీలో 'పొలం పిలుస్తోంది'ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి భారతి రైతులకు పంట బీమాపై అవగాహన కల్పించారు. పంటల ఇన్సూరెన్స్ పథకం గురించి వివరించారు. వేరుశనగ, మామిడి పంటలకు మెళకువల గురించి వివరించారు. పథకాలు గురించి పంటలో విత్తన శుద్ధి , ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగులు నివారణ చర్యలు గురించి ఆర్టికల్చర్ అధికారిణి యామిని వివరించారు. హార్టికల్చర్ స్కీమ్స్, ప్రకృతి వ్యవసాయం, ఘన జీవామృతం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని చంద్రశేఖరపురం, చెందోడు గ్రామంలో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా బుధవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్ రైతుల పొలాలను పరిశీలించారు. సబ్సిడీలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావలిసిన రైతులు పట్టాదారు పాసు బుక్,ఆధార్ కార్డుతో స్థానిక రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. వరి నారుమడి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, నారు శుద్ధి, కషాయాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి నిరంజన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి డి సాయికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు డి భూషణ్ రావు, పశుసంవర్ధ శాఖ గ్రామ సహాయకులు కె విజయ్ కుమార్, ప్రకృతి వ్యవసాయ ఏపీసీఎన్ఎఫ్ మోడల్ మేకర్ శ్రీనివాసులు, బాబాసాహెబ్, ఐసిపిఆర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేలపట్టు పక్షుల కేంద్రంలో శిక్షణా ఐఏఎస్‌లు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : అఖిల భారత సర్వీస్ పోటీ పరీక్షల్లో ఎంపికైన 9 మంది శిక్షణా ఐఏఎస్ అధికార్లు బుధవారం దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు విదేశీ పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. వీరు పక్షుల గూడు కట్టి నివాసమున్న ప్రాంతాలతో పాటు పర్యాటకులకు ఏర్పాటుచేసిన వసతి సౌకర్యాలు, జింకల పార్కు, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. గైడ్ హుస్సేన్ విదేశీ పక్షుల వలస,పిల్లల పొదగడం వంటి విషయాలన్నిటినీ వివరించారు. ట్రైనీ ఐఏఎస్ అధికారులు అన్నింటినీ పరిశీలించి పక్షుల కేంద్రాన్ని సందర్శించడం తమకెంతో ఆనందంగా ఉందని వారి అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యాటకులకు వసతి సౌకర్యాలు కూడా బాగున్నాయని వెల్లడించారు. వీరి వెంట తహశీల్దారు శైలకుమారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్ ప్రవీణ్ రాయల్, పక్షుల కేంద్రం సిబ్బంది బాలయ్య హాజరయ్యారు.

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు మంగళం విద్యార్థి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)
మంగళం పరిధిలోని మంగళం ట్రెండ్స్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న యూ. హరిప్రియ జాతీయస్థాయిలో నిర్వహించే బేస్బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు నాయుడు తెలిపారు. ఈనెల 9 నుండి 11వ తేదీ వరకు గుంటూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 బేస్బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరచి జాతీయస్థాయి బేస్బాల్ పోటీలకు ఎంపిక అయిందన్నారు. డిసెంబర్లో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి బేస్బాల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. హరిప్రియ ప్రతిభకు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్ మెమెంటోతో సత్కరించి 1016 రూపాయల నగదు బహుమతి ప్రదానం చేశారు. హరిప్రియను ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసుంధర, కష్ణం నాయుడు, జగన్నాథం, చంద్రశేఖర్, శారద, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రామినాయుడు ఉన్నారు.

తిరుమలకు చేరుకున్న కేజ్రీవాల్

ప్రజాశక్తి - తిరుమల:
ఆమ్ఆద్మీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద టిటిడి అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. బుధవారం రాత్రి తిరుమలలోనే ఆయన బస చేస్తారు. గురువారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అధ్యాపక ఖాళీలు వెంటనే భర్తీ చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ :
విజయనగరం జిల్లా గరివిడి మొదటి బ్యాచ్ విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం లేకుండా వారికి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం (సిపిఎం) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామనాయుడు, రైతు సంఘం నేత డాక్టర్ టి జనార్ధన్లు పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయ విసి డాక్టర్ జెవి.రమణకు వారు వినతిపత్రం ఇచ్చారు.

శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపు సులభతరం

నూతన కౌంటర్ ప్రారంభించిన అడిషనల్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల
తిరుమలలో ఇచ్చే ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపు ప్రక్రియను మరింత సులభతరం చేసినట్లు టీటీడీ అడిషనల్ ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. గోకులం సమావేశ మందిరం వెనుక వైపు శ్రీవాణి దర్శన టికెట్ల నూతన కౌంటర్ ను ఆయన బుధవారం ఉదయం ప్రారంభించారు. కౌంటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వయంగా భక్తుల వద్ద వివరాలు తీసుకుని మొదటి టికెట్ ను కేటాయించారు. అడిషనల్ ఈవో మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న శ్రీవాణి కౌంటర్ క్యూలైన్లలో వర్షం పడినప్పుడు భక్తులు ఇబ్బంది పడటాన్ని గుర్తించి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజుకు 900 టికెట్లను ఆఫ్ లైన్ ద్వారా కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో టికెట్ కేటాయింపునకు మూడు నుండి నాలుగు నిమిషాలు పట్టేదనీ, ప్రస్తుతం ఒక నిమిషంలో భక్తులకు టికెట్ కేటాయించేలా అప్లికేషన్ లో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఐదు కౌంటర్ల ద్వారా భక్తులకు సులభతరంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలియజేశారు. టీటీడీ సిఇ సత్య నారాయణ, డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, ఏఈవో కష్ణయ్య పాల్గొన్నారు.

అమరరాజాకు 12 బంగారు అవార్డులు

ప్రజాశక్తి - రేణిగుంట అంతర్జాతీయ స్థాయి క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ పోటీలలో అమరరాజా సంస్థ నుంచి పాల్గొన్న 12 టీమ్ లకు, 12 బంగారు అవార్డులు లభించాయి. ఈ పోటీలలో అమర రాజా సంస్థతో పాటు 14 దేశాల నుండి 800 పైగా టీమ్ లు పాల్గొన్నాయి. మంగళవారం కొలంబో, శ్రీలంకలో జరిగిన 49వ అంతర్జాతీయ స్థాయి క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ పోటీలలో అమర రాజ సంస్థకు 12 బంగారు పతకాలు సాధించారని సంస్థ యాజమాన్యం మీడియాకు వెల్లడించింది. లెడ్ యాసిడ్ బ్యాటరీ తయారీ, పవర్ కన్వర్షన్ ఉత్పత్తులు, ఇంజనీరింగ్, ప్లాస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ సర్వీసెస్, ఆహార ఉత్పత్తులు లాంటి వివిధ రంగాలలో వ్యాపారాలను విస్తరించిన ఇండియన్ బహుళ జాతి సంస్థ అయిన అమర రాజ నుండి 12 టీమ్ లు ఈ అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని మాట్లాడుతూ మహోన్నత విజయాలనేవి ఎప్పుడూ ఉమ్మడి లక్ష్యం దిశగా కలిసికట్టుగా పనిచేసినపుడే వరిస్తాయన్నారు.

టొయోటాలో సరికొత్త ఆఫర్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అద్భుతమైన సంవత్సరాంతపు ఆఫర్లతో టయోటా కిర్లోస్కర్ మోటార్ గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్ అండ్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ప్రత్యేక లిమిటెడ్-ఎడిషన్ను పరిచయం చేశామని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్లకు అద్భుతమైన స్పందన వచ్చిన తరువాత, స్పెషల్ లిమిటెడ్-ఎడిషన్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను అందించి వినియోగదారులను మెప్పించేందుకు కొత్త ఆఫర్లు పెట్టమన్నారు. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా, టొయోటా గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్ అండ్ రూమియన్ (సిఎన్ జి మోడల్లు మినహా)లో రూ.1 లక్షపైన ప్రత్యేకమైన ఇయర్ ఎండ్ ఆఫర్లను అందిస్తోంది. వినియోగదారు ప్రయోజనాలు 31 డిసెంబర్ వరకు ఈ ఆఫర్లు కొనసాగుతాయన్నారు. తమ కంపెనీ వెబ్సైట్లో ఇతర వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు

చంద్రగిరి గాదంకి, చెక్ పోస్టుల తనిఖీలో ఎస్పి

ప్రజాశక్తి -చంద్రగిరి: ఎర్రచందనం, మత్తుపదార్థాలు వంటి అక్రమ రవాణా, వాటి నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలోని గాదంకి అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్టు, సురుటుపల్లి, తడ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ఆకస్మికంగా సందర్శించి, సీసీ కెమెరాల పనితీరును, ప్రస్తుతం సిబ్బందికి అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఇంకా అవసరమైన వాటిని సమకూర్చాలని స్థానిక పోలీస్ అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో ముచ్చటించి, తనిఖీల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఎవరైనా తప్పించుకుంటే పోలీస్ స్టేషన్ వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా నుండి ఇసుక, గ్రావెల్, ఎర్రచందనం వంటివి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మనదే అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు తిరుపతి జిల్లా మీదుగా రవాణా కాకుండా కట్టడి చేయాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ పిలుపు నిచ్చారు. ప్రస్తుతం వారు అమలు చేస్తున్న ప్రణాళికను తెలుసుకొని, ఇంకా మెరుగైన తనిఖీల కోసం పాటించవలసిన సూచనలు, సలహాలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డిఎస్పి బి ప్రసాద్, సిఐ.సుబ్బరామిరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న ఎస్‌పి సుబ్బరాయుడు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చంద్రగిరి: ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో తిరుపతిలోని అమరా మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందంచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం చంద్రగిరిలో కరకంబాడి వద్ద ఉన్న అమరా మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ గౌరినేని డాక్టర్ వరప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవిల చొరవతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు పాల్గొని ఈసీజీ, బిపి, మధుమేహం, వివిధ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ జబ్బులకు, గుండె, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు డాక్టర్ లోకేష్, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ రవి కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 150 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి మెరుగైన వైద్య సేవల కోసం అమరా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు రెఫర్ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని అమరా మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పరమేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్‌గా చెంగయ్య

ప్రజాశక్తి - వెంకటగిరి
సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్గా వడ్డిపల్లి చెంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రథమ మహాసభ సిపిఎం కార్యాలయంలో జరిగింది. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల నుంచి పార్టీ సభ్యులు హాజరయ్యారు. తిరుపతి జిల్లా సీనియర్ నాయకులు జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజాపోరు ధర్నాను జయప్రదం చేయాలని మహాసభ తీర్మానించింది. కమిటీ సభ్యులుగా అయిలా భాస్కర్, గజ్జల రాజగోపాల్, స్వర్ణక్క, ఉదయం ఎన్నికయ్యారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ సిపిఎం జెండా అండగా ఉంటుందన్నారు. పెట్లూరు గ్రామపంచాయతీ పరిధి సీతారాం ఏచూరి నగర్ లో నివాసాలు ఉంటూ వారికి విద్యుత్ మీటర్లు పెట్టకునేందుకు పర్మిషన్ ఇప్పించాలని అన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. నివాసాలు ఉంటున్న వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని అన్నారు.

ప్రసంగిస్తున్న జిబిఎస్ మణ్యం

'శ్రీకాళహస్తిలో కమీషన్ బ్రోకర్ల ఆట కట్టించాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)
శ్రీకాళహస్తి పట్టణంలో స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు, యాత్రికులను లాడ్జిలలో రూము బుకింగ్ చేయిస్తూ నిలువునా దోచుకుంటున్నారని, వీరిని అరికట్టాలని శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యోగానంద్ జిల్లా ఉన్నతాధికారులను కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఆర్తి పూర్ణేష్ స్థానికంగా వారికున్న స్థలంలో తిరుమల రెసిడెన్సీ అనే డార్మేటరీ హాలును నిర్మించి శివుని దర్శనానికి వచ్చే భక్తులకు సేవా రూపంలో 100 రూపాయలకే డార్మేటరీ బెడ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారని, అయితే స్థానికంగా 10 లాడ్జిలను నిర్వహించే హరినాయుడు అతని వద్దనున్న కొంత మంది కమీషన్ బ్రోకర్లు యాత్రికులకు డార్మేటరీ హాలు గురించి తప్పుగా చెబుతున్నారని, పైగా తమపై కమిషన్ బ్రోకర్లు సిండికేట్గా ఏర్పడి గత నెల 18వ తేదీన దాడులు చేశారన్నారు. ఇదంతా అక్కడి పోలీసులకు తెలిసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

త్వరలో కళాశాల బ్యాంక్ ఖాతాలకు పెండింగ్ స్కాలర్‌షిప్స్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్
పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్షిప్ సంబంధించి పెండింగ్లో ఉన్న ఆర్టిఎఫ్, ఎంటిఎఫ్ బకాయిలను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుందని, కాలేజి యాజమాన్యం విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తల్లుల ఖాతాల్లో సదరు ఫీజు రీయింబర్స్మెంట్ నగదు జమచేసే వారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను 2024 - 25 విద్యా సంవత్సరం నుండి కళాశాలల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేసే పాతవిధానాన్ని పునరుద్ధరిస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పేర్కొన్నారని తెలిపారు. వాటితో పాటు గత ప్రభుత్వం పెట్టిన 3500 కోట్ల రూపాయల బకాయిలను దశల వారీగా చెల్లిస్తామన్నారు.